# నీకు జ్ఞాపకం ఉందా?

నీకు జ్ఞాపకం ఉందా? రాధా! మనం స్కూల్లో చదువుకొనేటప్పుడు కెమిస్ట్రీ ఎక్స్‌పెరిమెంట్లు చేస్తూ మనం ఇద్దరం కలుసుకొన్న రోజు.

నీవు మా ఊరికి క్రొత్తగా వచ్చావు. మీరు గొప్పవారని తెలుసుకొన్నాను. నా చిన్నప్పుడే మా నాన్న మమ్మల్ని విడిచి వెళ్ళిపోయాడు. మా అమ్మ బట్టలుకుట్టి నన్ను చదివించేది. నేను నీతో స్నేహం చేసినప్పుడు, మా అమ్మ నన్ను తిట్టేది – గొప్పింటివాళ్ళతో స్నేహం చేయకూడదని, కాని నేను మా అమ్మ చెప్పినమాట వినలేదు.

ఆ రోజు నీవు నన్ను నీ పుట్టిన రోజుకి మీ ఇంటికి పిలిచావు. మా అమ్మ వెళ్ళవద్దని చెప్పింది. కాని నేను మా అమ్మకి తెలియకుండా మీ ఇంటికి వచ్చేశాను. నేను వచ్చేసరికి మీ ఇంటినిండా చాలామంది బంధువులు ఉన్నారు. వాళ్ళందరు నీకు ఏవో కానుకలు ఇస్తున్నారు. నన్ను నీవు దూరంనించి చూడగానే పరిగెత్తుకొచ్చావు. "నేనేమీ, తీసుకొని రాలేదు, రాధా! నీకు ప్రెజంటు ఇద్దామంటే నా దగ్గర ఏమీ లేదు."

"నీవే వచ్చావుగా, అదే నాకు ప్రెజంటు" అన్నావు.

ఆ తర్వాత మనకు పరీక్షలు దగ్గరకు వచ్చాయి, వెళ్ళిపోయాయి కూడా! మా అమ్మ నన్ను కాలేజీకి పంపించలేక ఉద్యోగం చేయమంది. ఏదో మన ఊళ్ళో ఉన్న ఒక చిన్న కంపెనీలో ఉద్యోగం దొరికింది. ఆ విషయం చెబుదామని మీ ఇంటికొస్తే, మీ అమ్మ నిన్ను చూడనివ్వలేదు. "నీవు ఇంక రాధని కలుసుకోకూడదబ్బాయ్!" అన్నది. నాకు ఏడుపు వచ్చినంత పనయింది.

ఆ తర్వాత నువ్వు పై చదువులకి మీ మామయ్యగారి ఊరు వెళ్ళిపోయావు. వెళ్ళిపోతున్నప్పుడు అంతవరకు మన గుండెలలో పదిలంగా దాచుకున్న ప్రేమ పెల్లుబికి వచ్చింది. విడలేక విడలేక విడిపోయాము.

కొన్నాళ్ళపాటు ఉత్తరాలు వ్రాసుకునేవాళ్ళం. నెమ్మదిగా అవిరుండా తగ్గిపోవడం మొదలుపెట్టాయి. వస్తావని ఎదురు చూసేవాడిని. ఒకసారి, ఎడ్యుకేషనల్ టూర్‌కి వెళ్ళాలని, మరొకసారి ఏదో పెళ్ళికి వెళ్ళాలని సెలవలకు రాకుండా అక్కడే గడిపేశావు.

అలా రోజులు, వారాలు, నెలలు గడిచిపోయాయి. మన ఊరు పెద్దదయింది. నాకు ఇంకొక పట్టణంలో అదే కంపెనీలో పెద్ద ఉద్యోగం వచ్చింది. మా అమ్మ బట్టలు కుట్టడం మానేసి నా దగ్గరకు వచ్చేసింది....

ఆ తరువాత... ...మనం ఎలాగో కలుసుకొన్నాము. నా రాధ నాదయింది. మనం ఈ రోజున మన ఇరవై ఆరవ వివాహ వార్షికోత్సవం జరుపుకోబోతున్నాము. ఈ సమయంలో నీవు మన అమ్మాయి రేఖని గురించి విచారించడం బాగాలేదు. రేఖ ఎవరినో ప్రేమించిందని అనుమానిస్తున్నావు గదూ. అది నిజమే. మొన్న వాళ్ళిద్దరిని పార్కులో చూశాను. అమ్మాయి ద్వారా ఆ అబ్బాయిని పిలిపించి అన్ని విషయాలు కనుక్కుందాము.

నీకు జ్ఞాపకం ఉందా? రాధా! ఒక రోజున, నీ పుట్టినరోజుకు ఒక బీద అబ్బాయిని ఆహ్వానించావు!

***

రెండవ బహుమతి రూ. 25

ఎ. బి. రామారావు

బి. టెక్ (ఫైనల్)
[కెమికల్ ఇంజినీరింగు]
ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, బొంబాయి–76

